సాక్షి వికారాబాద్

మంగళవారం, 25, ఏప్రిల్, 2023



చకచకా పనులు
నవాబుపేట మండల ప్రజల ఎన్నో ఏళ్ల నిరీక్షణ.. చిరకాల వాంఛ ఎట్టకేలకు నెరవేరుతోంది. 8లో▸



హామీల అమలులో విఫలం
ఎమ్మెల్యే అసమర్థతతోనే పరిగి అభివృద్ధి కుంటుపడిందని, హామీలు నిలబెట్టుకోలేదని డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి అన్నారు. 8లో▸



ఉపాధి ఫుల్..
గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులతో కూలీలు, కార్మికులకు ఉపాధి లభిస్తోంది. 9లో▸

న్యూస్‌రీల్

డీఈఈ సెట్‌కు దరఖాస్తు చేసుకోండి

వికారాబాద్ అర్బన్‌:ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ఇంటర్‌లో అర్హత మార్కులు సాధించిన అభ్యర్థులు ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో డీఈఈ 2023– 25 రెండేళ్ల కోర్సులో చేరేందుకు దరఖాస్తు చేసుకోవచ్చని వికారాబాద్ ప్రభుత్వ డైట్ కళాశాల ప్రిన్సిపల్ రామాచారి ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 22 నుంచి మే 22 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హత పరీక్ష ఆన్‌లైన్‌లో ఉంటుందని పేర్కొన్నారు. వివరాలకు htt p/deecet. cdre.tea nfana.gov.in వెబ్‌సైట్‌లో సంప్రదించాలని తెలిపారు.

మహిళలకు ఉచిత శిక్షణ

ధారూరు: గ్రామీణ ప్రాంత మహిళలకు మగ్గం వర్క్, బ్యూటీషియన్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు భారతీయ స్టేట్‌బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి సంస్థ చిల్కూరు సంచాలకులు కె.రమేశ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 19 నుంచి 45 సంవత్సరాల వయస్సు కలిగిన వారు ఇందుకు అర్హులని, దరఖాస్తుదారులు ఎస్ఎస్‌సీ, రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, బ్యాంక్ పాసుబుక్కు జిరాక్స్ కాపీలతో పాటు 4 పాస్ పోర్ట్ సైజ్ ఫొటోలు జతచేసి సమర్పించాలని సూచించారు. దరఖాస్తుదారులు విధిగా వికారాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలకు చెందిన వారై ఉండాలని తెలిపారు. మే 2నుంచి 30 రోజుల పాటు ఉచిత శిక్షణ ఉంటుందని, ఈ సమయంలో వసతి, భోజన సౌకర్యం కల్పిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు 8639079122, 7981951167, 9000778300 నంబర్లకు ఫోన్ చేసి వివరాలు నమోదు చేయించుకోవాలని సూచించారు.

పోస్టు కార్డుల ఉద్యమం



పోస్టుకార్డులు చూపిస్తున్న పంచాయతీ జూనియర్ కార్యదర్శులు

తాండూరు రూరల్: తమను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ జూనియర్ పంచాయతీ కార్యదర్శులు పోస్టు కార్డు ఉద్యమం చేపట్టారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం నుంచి సోమ వారం ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఉత్తరాలు పంపించారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ.. సీఎం స్పందించి వెంటనే రెగ్యులరైజ్ జీఓను విడుదల చేయాలని కోరారు. ఔట్‌సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులను జేపీఎస్‌లుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. మరణించిన జూనియర్ పంచాయతీ కార్యదర్శుల కుటుంబాలకు కారుణ్య నియామకాల్లో అవకాశం కల్పించాలన్నారు. 317 జీఓతో నష్టపోయిన వారికి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో లాలప్ప, ఫక్రోజీ, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

27న నవోదయ మోడల్ పరీక్ష

కొడంగల్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల 27న నవోదయ మోడల్ పరీక్ష నిర్వహించనున్నట్లు పాత కొడంగల్ హైస్కూల్ హెచ్ఎం క్రాంతికుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతి చదువుతున్న తెలుగు, ఇంగ్లిష్ మీడియం విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉదయం 10నుంచి 12 గంటల వరకు ఎగ్జామ్ ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు 83097 55644 నంబర్‌కు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

ఫారెస్ట్ ఏరియాలో చెట్ల నరికివేత

దోమ: అటవీ ప్రాంతంలోని వృక్షాలను కొంత మంది అక్రమార్కులు యథేచ్ఛగా నరికి, వాహనాల్లో తరలిస్తున్నారు. ఈ విషయమై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఫారెస్ట్ ఏరియాలోని విలువైన చెట్లు గొడ్డలి వేటుకు గురవుతున్నాయి. కొంతమంది ఇదే పనిగా అక్రమార్జకు పాల్పడుతున్నారని, అధికారులకు తెలిసినా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఊటుపల్లి గ్రామానికి చెందిన గ్రామస్తుడు ఆంజనేయులు ఆరోపించారు. సోమవారం తిమ్మాపల్లి అటవీ ప్రాంతంలో చెట్లు నరికి తరలిస్తున్నారని అటవీశాఖ అధికారులకు చెప్పినా పట్టించుకలోలేదని మండిపడ్డారు.



తిమ్మాయిపల్లి అడవిలో అక్రమార్కులు నరికేసిన చెట్లు

డేంజర్ జర్నీ!



హెల్మెట్ ధరించి వాహనదారులకు చైతన్యం కల్పిస్తున్న పోలీసులు

వాహనదారుడా మేలుకో..
- యాక్సిడెంట్లకు కేరాఫ్‌గా బీజాపూర్ జాతీయ రహదారి
- జిల్లావ్యాప్తంగా మూడేళ్లలో 1,137 రోడ్డు ప్రమాదాలు
- 564 మంది దుర్మరణం, 1,257 మందికి తీవ్ర గాయాలు
- పోలీసులు చైతన్యం కల్పిస్తున్నా.. కానరాని మార్పు

తాండూరు: ప్రజలు, వాహనదారులకు ఎంత అవగాహన కల్పిస్తున్నా.. జిల్లాలో రోడ్డు ప్రమాదాలు తగ్గడం లేదు. జాతీయ రహదారులపై జరుగుతున్న ప్రమాదాల్లో మన జిల్లా దేశంలోనే టాప్ టెన్ స్థానంలో నిలిచిందంటే ఇక్కడ పరిస్థితి ఎలా ఉందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఇందుకు ప్రధాన కారణం హైదరాబాద్– బీజాపూర్ నేషనల్ హైవేనే. ఈ రూట్లో నిత్యం ఎక్కడో ఒకచోట ప్రమాదం జరుగుతూనే ఉంది. ఈ మార్గంలో ప్రయాణం అంటేనే జనం జంకుతున్నారు. హైవే పోలీస్ పికెటింగ్‌లు ఉన్నప్పటికీ యాక్సిడెంట్లు ఆగడం లేదు.

ఎస్పీ నేతృత్వంలో..
ప్రమాదాల నియంత్రణకు పోలీసు శాఖ అనేక కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఎస్పీ కోటిరెడ్డి నేతృత్వంలో జిల్లాలోని మూడు సబ్ డివిజన్లు, 19 పోలీస్ స్టేషన్లు, ఓ మహిళా పోలీస్ స్టేషన్ పరిధిలో చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఎంత చెబుతున్నా వాహనదారులు నిబంధనలు పాటించకపోవడం వీరికి తలనొప్పిగా మారింది. హెల్మెట్ ప్రాముఖ్యతను వివరిస్తూ పోలీసులు హెల్మెట్లు ధరించి ర్యాలీలు నిర్వహిస్తున్నారు. జిల్లాలో వాహనాల సంఖ్య ఏటా భారీగా పెరుగుతోంది. ఇటీవలి కాలంలో కార్లు, ద్విచక్ర వాహనాల కొనుగోలు ఎక్కువైంది. రవాణా శాఖ నుంచి ఆర్సీ పొందకుండానే వాహనాలను రోడ్లపై తిప్పుతున్నారు. మరో వైపు ఆటోలు, కార్లు, ప్రైవేటు వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తున్నారు. ప్రమాదాలకు ఇదో కారణమవుతోంది.

మూడేళ్లలో..
2020– 22 మధ్య కాలంలో జిల్లావ్యాప్తంగా 1,137 రోడ్డు ప్రమాదాలు జరిగాయి. 564 మంది మృత్యువాత పడగా.. 1,257 మంది క్షతగాత్రులయ్యారు. వికారాబాద్ సబ్ డివిజన్ పరిధిలో 248 యాక్సిడెంట్లు జరగగా 160 మంది చనిపోయారు. మరో 408 మంది తీవ్రంగా గాయపడ్డారు. పరిగి సబ్ డివిజన్‌లో చోటుచేసుకున్న 541 ప్రమాదాల్లో 292 మంది మృతిచెందగా.. 582 మంది క్షతగాత్రులయ్యారు. తాండూరు సబ్ డివిజన్ పరిధిలో 248 యాక్సిడెంట్లు జరగగా 112 మంది మృత్యువాత పడ్డారు. 267 మంది క్షతగాత్రులయ్యారు. ఆయా ప్రమాదాల్లో గాయపడిన వారిలో చాలా మంది కాళ్లు, చేతులు కోల్పోయి వికలాంగులుగా మారారు.

ఎక్కడికక్కడ తనిఖీలు
రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో ట్రాఫిక్ నిబంధనలపై చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నా వాహనదారుల్లో మార్పు రావడం లేదు. ఎక్కడికక్కడ వాహనాల తనిఖీ చేపడుతూ.. డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు చేస్తున్నా.. పరిస్థితి పెద్దగా మారడం లేదు. హెల్మెట్, సీటు బెల్టు ధరించకపోవడంతో ప్రమాద సమయాల్లో ప్రాణనష్టం జరుగుతోంది. దీనికితోడు ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం, అతివేగం, నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం, నోఎంట్రీ జోన్‌లలో వాహనాలతో వెళ్లడం వంటి కారణాలతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి.

అవగాహన కల్పిస్తున్నాం



తాండూరు సబ్ డివిజన్ పరిధిలో ట్రాఫిక్ నిబంధనలపై వాహనదారులకు అవగాహన కలిపస్తున్నాం. గతంతో పోలిస్తే 2022 నుంచి ఇప్పటి వరకు రోడ్డు ప్రమాదాలు కొంతవరకు తగ్గాయి. వీటిని పూర్తిగా నియంత్రించాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నాం. కొందరు వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ పాటించడం లేదు. జరిమానాలు వేసినా మార్పు రావడం లేదు. మద్యం తాగి వాహనాలను నడిపిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

– శేఖర్‌గౌడ్, డీఎస్పీ, తాండూరు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ రంజిత్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, మెతుకు ఆనంద్, మహేశ్వర్‌రెడ్డి తదితరులు

అభివృద్ధిని చూసి ఓర్వలేకే విమర్శలు

- ఎంపీ రంజిత్‌రెడ్డి

చేవెళ్ల: రాష్ట్రంలో అభివృద్ధిని చూసి ఓర్వలేకే బీజేపీ నేతలు విమర్శలు చేస్తున్నారని ఎంపీ డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి అన్నారు. మతాల మధ్య విద్వేషాలు రేపేందుకే చేవెళ్లలో బీజేపీ విజయసంకల్ప సభ నిర్వహించిందని విమర్శించారు. మండలకేంద్రంలో సోమవారం చేవెళ్ల, వికారాబాద్, పరిగి ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, ఆనంద్, హరీశ్వర్‌రెడ్డితో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఢిల్లీ నుంచి గల్లీ వరకు బీజేపీ నాయకులు వచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం సంక్షేమం అంటుంటే కేంద్రం సంక్షోభం అంటోందన్నారు. తొమ్మిదేళ్లలో బీజేపీ ప్రభుత్వం రాష్ట్రం అడిగిన ఏ ఒక్కటైనా ఇచ్చిందా అని నిలదీశారు. హైదరాబాద్–బీజాపూర్ రహదారిపై బీజేపీ నేతల మాటల్లో నిజం లేదన్నారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుపై అమిత్‌షా ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య మాట్లాడుతూ..మరోసారి కేసీఆర్, వారి కుటుంబంపై విమర్శలు చేస్తే సహించేది లేదన్నారు. బండి సంజయ్‌ను మెచ్చుకోవటానికే సభ పెట్టినట్లు ఉందన్నారు. రాష్ట్రంలో బీజేపీకి క్యాడర్ లేదు కాంగ్రెస్‌కు లీడర్ లేరని..ఈ రెండూ ఉన్న పార్టీ బీఆర్ఎస్ అని వికారాబాద్ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ అన్నారు. బీఆర్ఎస్ పార్టీ హ్యాట్రిక్ విజయం సాధించటం ఖాయమన్నారు.బీజేపీ దమ్ముంటే కాళేశ్వరానికి జాతీయ హోదా కల్పించాలని పరిగి ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డిడిమాండ్ చేశారు.వచ్చే ఎన్నికల్లో వారికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. సమావేశంలో చేవెళ్ల, శంకర్‌పల్లి ఎంపీపీలు ఎం.విజయలక్ష్మి, గోవర్ధన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రశాంత్, సర్పంచుల సంఘం అధ్యక్షుడు శేరి శివారెడ్డి, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

‘ప్రజావాణి’పై నమ్మకం పెరిగింది



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

- వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించండి
- కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశం
- 254 అర్జీల స్వీకరణ

వికారాబాద్ అర్బన్‌: జిల్లాలో నిర్వహిస్తున్న ప్రజావాణి ద్వారా సమస్యలు పరిష్కారం అవుతాయనే నమ్మకం ప్రజలకు కలిగిందని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. అందుకే ప్రతీ సోమవారం నిర్వహిస్తున్న కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో 254 మంది నుంచి అభ్యర్థనలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజలకు కలిగిన నమ్మకాన్ని వమ్ముచేయకుండా వచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులకు సూచించారు. అయ్యే పని అవుతుందని.. కాని పని ఉంటే కారణాలు తెలుపుతూ కాదని వివరించాలని సూచించారు. సమస్యలను పెండింగ్ పెట్టి ప్రజలను ఇబ్బందులకు గురిచేయొద్దని తెలిపారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతోనే మండల కేంద్రాలు, మున్సిపాలిటీల్లో ప్రజావాణి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని స్పష్టంచేశారు. అంతకు ముందు వివిధ శాఖలతో సమీక్ష నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న సమస్యల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇంజనీరింగ్ శాఖ పరిధిలో ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా మన ఊరు మనబడి కార్యక్రమం కింద చేపట్టిన పనులు వేగంగా పూర్తి చేయాలన్నారు. అటెండెన్స్ యాప్‌ను తప్పకుండా అమలు చేయాలని ఆదేశించారు. ఈ నెల చివరి నాటికి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ తదితరులు ఉన్నారు.

అదిరేలా.. ‘ఆవిర్భావం’

- నేడు నియోజకవర్గ కేంద్రాల్లో బీఆర్ఎస్ ప్లీనరీలు
- పార్టీ ఆవిర్భావ వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తి
- ప్రజాప్రతినిధులు, కమిటీల బాధ్యులతో సమావేశం
- పార్టీ ప్రణాళికలు, కార్యక్రమాలపై తీర్మానాలు

వికారాబాద్: జెండా కార్యక్రమాలతో మమ అనిపించే బీఆర్ఎస్ పార్టీ ఈసారి ఆవిర్భావ వేడుకలు వినూత్న రీతిలో జరపాలని నిర్ణయించింది. త్వరలో నిర్వహించనున్న రాష్ట్ర ప్లీనరీ నేపథ్యంలో నియోజకవర్గ స్థాయిలో మినీ ప్లీనరీలు ఏర్పాటు చేసుకోవాలని సూచించింది. మంగళవారం పార్టీ ఆవిర్భావం దినోత్సవాన్ని పురస్కరించుకుని క్షేత్రస్థాయిలో వీటిని నిర్వహించనున్నారు. అధిష్టానం ఆదేశాలతో మినీ ప్లీనరీల నిర్వహణకు ఆ పార్టీ నేతలు సిద్ధమయ్యారు. నాలుగు నియోజకవర్గాల్లో అధికార పార్టీ ఎమ్మెల్యేలే ఉన్న నేపథ్యంలో.. ప్లీనరీ ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. ప్రజా ప్రతినిధులు, పార్టీకి చెందిన ఆయా విభాగాల నేతలతో కొనసాగే సమావేశాలకు నియోజకవర్గ స్థాయిలో మూడు నుంచి నాలుగు వేల మంది హాజరయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

ప్రతినిధుల సభల పేరుతో..
గతంలో మండలు, గ్రామాల్లో ఉండే ముఖ్య కార్యకర్తలు, నాయకులు హాజరై నియోజకవర్గ స్థాయిలో పార్టీ జెండాలు ఆవిష్కరించి ఆవిర్భావ వేడుకలు నిర్వహించేవారు. ప్రస్తుతం ఇందుకు భిన్నంగా ప్రతినిధుల సభల పేరుతో ప్లీనరీలు నిర్వహించాలని అధిష్టానం సూచించింది. ఈ బాధ్యతలను స్థానిక ఎమ్మెల్యేలకు అప్పగించింది. ఈ మీటింగ్‌లకు కార్యకర్తలందరినీ కాకుండా కేవలం ప్రతినిధులను మాత్రమే ఆహ్వానించనున్నారు. ఇందులో ప్రధానంగా పార్టీ తరఫున గెలిచిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు ఇతర ప్రజాప్రతినిధులు ఉంటారు. వీరితో పాటు పార్టీ బాధ్యతలు నిర్వహించే గ్రామ, మండల, నియోజకవర్గ కమిటీల ప్రతినిధులు, యువజన, కార్మిక, రైతు విభాగం నేతలను భాగస్వాములను చేస్తారు. ఇదే సమయంలో నియోజకవర్గ స్థాయిలో పార్టీ తరఫున చేపట్టాల్సిన అంశాలను చర్చిస్తారు. భవిష్యత్‌లో నిర్వహించాల్సిన కార్యక్రమాలపై తీర్మానాలు చేసి ఆమోదిస్తారు.

అసమ్మతి నేతలు వస్తారా..?
మునుగోడు ఎన్నికల అనంతరం పార్టీ బలోపేతంపై క్షేత్రస్థాయిలో దృష్టిసారించాలని బీఆర్ఎస్ అధిష్టానం ఆదేశించింది. ఆత్మీయ సమ్మేళనాల నిర్వహణతో పాటు నిరంతరం ప్రజల్లో ఉండాలని పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులను ఆదేశించింది. కానీ మన జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లోనూ సొంత పార్టీలోనే ఎమ్మెల్యేలకు వైరివర్గం తయారైంది. దీంతో ఏ చిన్న అవకాశం చిక్కినా వీరు తమ అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత ప్లీనరీలకు అసమ్మతి నేతలకు ఆహ్వానాలు అందిస్తారా..? ఇన్విటేషన్ అందినా వారు వస్తారా..? అనేది ప్రశ్నార్థకంగా మారింది.

అందరూ సహకరించాలి



అధిష్టానం సూచనల మేరకు అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో మినీ ప్లీనరీలు నిర్వహిస్తాం. ఇందుకోసం అన్ని ఏర్పాట్లు చేశాం. పార్టీ ఆదేశాలను ప్రతిఒక్కరూ పాటించాల్సిందే. ఏ పార్టీలోనైనా.. ఇంట్లో అయినా చిన్నచిన్న అభిప్రాయబేధాలు ఉండటం సహజమే. వీటన్నింటినీ పక్కన పెట్టి, ప్రతిఒక్కరినీ కలుపుకొని పోతాం. ప్లీనరీల జయప్రదానికి అందరూ సహకరించాలి.

– మెతుకు ఆనంద్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు

ఫలించిన పోరాటం



జయరామాచారికి నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేస్తున్న బీజేపీ నాయకులు

- నావంద్గీలో ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలుపుతామని జీఎం హామీ
- దీక్ష విరమించిన యువత

బషీరాబాద్: నావంద్గీ(బషీరాబాద్) రైల్వే స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలపాలని 25 రోజులుగా స్థానిక యువకులు చేపట్టిన పోరాటం ఎట్టకేలకు ఫలించింది. స్థానిక బీజేపీ నేతలు ఈ విషయాన్ని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన రెండు రోజుల క్రితం జీఎంకు లేఖ రాశారు. ఈ మేరకు నెల రోజుల్లో ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలిపేలా రైల్వేశాఖ జీఎం హామీ ఇచ్చినట్లు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీక్రిష్ణగౌడ్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేశ్‌కుమార్, సీనియర్ నాయకుడు నరేష్ మహారాజ్ తెలిపారు. స్థానిక ఆర్ఎంపీ వైద్యుడు జయరామాచారి ఆధ్వర్యంలో యువకులు నిర్వహించిన దీక్షకు మంచి స్పందన లభించింది. దీనిపై కేంద్రం సానుకూలంగా స్పందించింది. ఈ మేరకు ఆ పార్టీ నాయకులు సోమవారం దీక్ష స్థలానికి వెళ్లి జయ్‌రామ్‌చారి, యువకులకు నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేశారు. అనంతరం జయరామాచారి మాట్లాడుతూ.. తమ దీక్షకు అన్ని రాజకీయ పార్టీలతో పాటు ఉద్యోగులు, యువకులు మద్దతుగా నిలిచారన్నారు. బీజేపీ నాయకులు బాధ్యత తీసుకొని తమ సమస్యను జీఎం వరకు తీసుకెళ్లడంపై సంతోషం వ్యక్తంచేశారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజ్‌కుమార్ కులకర్ణి, వడ్డే శ్రీనివాస్, ప్రశాంత్, రాఘువేంద్ర సుత్రవే, నందకుమార్ చారి, బాలు, శేఖర్, మొగులప్ప తదితరులు పాల్గొన్నారు.

సర్కారు బడుల్లో సమ్మర్ క్యాంపులు

- కనీస సామర్థ్యాలు సాధించేలా బోధన
- ఉదయం 8నుంచి 10గంటల వరకు ప్రత్యేక తరగతులు
- జిల్లా విద్యాధికారి రేణుకాదేవి



పరిగి: చిట్యాల పాఠశాలలో విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులు అందజేస్తున్న డీఈఓ రేణుకాదేవి

పరిగి: విద్యార్థులు చదివింది మర్చిపోకుండా ఉండేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో స్వచ్ఛందంగా సమ్మర్ క్యాంపులు నిర్వహిస్తున్నామని జిల్లా విద్యాధికారి రేణుకాదేవి సూచించారు. మండల పరిధిలోని చిట్యాల ఉన్నత పాఠశాలలో సోమవారం ఏర్పాటు చేసిన తల్లిదండ్రులు, అధ్యాపకుల సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విద్యార్థులకు ప్రోగ్రెస్ రిపోర్టులు అందజేశారు. ఏ గ్రేడ్ సాధించిన వారిని అభినందించారు. అనంతరం డీఈఓ మాట్లాడుతూ.. ఉన్నత పాఠశాలలో త్వరలోనే మనఊరు– మనబడి పనులను ప్రారంభిస్తామని తెలిపారు. వేసవి సెలవులు వృథా కాకుండా సమ్మర్ క్యాంపులు నిర్వహిస్తున్నామని వివరించారు. తెలుగు, ఇంగ్లిష్‌లో చదవడం, రాయడంతో పాటు గణితంలో కనీస సామర్థ్యాలు సాధించే విధంగా శిబిరాలను నిర్వహిస్తామన్నారు. ఉదయం 8నుంచి 10గంటల వరకు తరగతులు కొనసాగుతాయని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రజితపుల్లారెడ్డి, ఉన్నత, ప్రాథమిక పాఠశాలల హెచ్ఎంలు వెంకట్, ఉసన్మాన్‌ఆలీ, ఎస్ఎంసీ చైర్మన్ శారద, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చదువుకు సమయం కేటాయించండి..
కుల్కచర్ల: విద్యాభ్యాసంలో ప్రతీ సంవత్సరం ఎంతో కీలకమైనదని, వేసవి సెలవుల్లో చదువుపై దృష్టి పెట్టాలని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి, చెల్లాపూర్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు దేవుల అన్నారు.ముజాహిద్‌పూర్, చెల్లాపూర్ తదితర పాఠశాలలలో సోమవారం విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులు అందజేశారు.సెలవుల్లోనూ నిత్యం కొంత సమయాన్ని చదువుకోసం కేటాయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



కుల్కచర్ల: చెల్లాపూర్ ప్రాథమిక పాఠశాలలో ప్రోగ్రెస్ కార్డులతో విద్యార్థుల ఆనందం

క్లుప్తంగా

రేషన్‌ బియ్యం పట్టివేత



పోలీసులు స్వాధీనం చేసుకున్న ఆటో, రేషన్‌ బియ్యం బస్తాలు

పరిగి: అక్రమంగా తరలిస్తున్న రేషన్‌ బియ్యాన్ని సోమవారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ విఠల్‌రెడ్డి తెలిపిన వివరాలు.. పరిగి – షాద్‌నగర్‌ మార్గంలో రేషన్‌ బియ్యం అక్రమ రవాణా జరుగుతున్నట్లు సమాచారం రావడంతో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. మహిపాల్‌ అనే వ్యక్తి తన ఆటోలో ఆరు క్వింటాళ్ల రేషన్‌ బియ్యం తరలిస్తున్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఆటోను సీజ్‌ చేసి, మహిపాల్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కనీస వేతనం అమలు చేయాలి



ఏపీఎంకు వినతిపత్రం అందజేస్తున్న సంఘం నాయకులు

అనంతగిరి: వీఓఏలకు కనీస వేతనం రూ. 18వేలు ఇవ్వాలని ఆ యూనియన్‌ మండల అధ్యక్షుడు ప్రభు, ప్రధాన కార్యదర్శి పుల్లయ్య సోమవారం డిమాండ్‌ చేశారు. తమ న్యాయమైన డిమాండ్లు తీర్చాలని కోరుతూ వీఓఏలు నిరవధిక సమ్మె చేపడుతున్నారు. తమ సమ్మెకు ఏపీఓలు, సీసీలు మద్దతు ఇవ్వాలని కోరారు. అనంతరం వారు మాట్లాడుతూ.. తమను సెర్ప్‌ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. రూ. 10 లక్షల ఇన్సూరెన్స్‌ కల్పించాలన్నారు. కార్యక్రమంలో యూనియన్‌ మండల కోశాధికారి సుధాకర్‌, సభ్యులు సురేఖ, పుష్ప, సుజాత, లక్ష్మి, జంగన్న, నాగరాజు, కవిత తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లకు రేవంత్‌ క్షమాపణ చెప్పాలి

బొంరాస్‌పేట: ముదిరాజ్‌ కులస్తులకు పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి బేషరతుగా క్షమాపణ చెప్పాలని బీజేపీ తెలంగాణ ఎస్‌ఆర్‌ఐ లీడర్‌ అలమయ్య నాయుడు సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్‌ చేశారు. ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌పై రేవంత్‌రెడ్డి అసభ్య పదజాలంతో మాట్లాడడం సరికాదన్నారు. రాజకీయ విమర్శలకు ప్రతి విమర్శలు చేయాలే తప్ప వ్యక్తిగత దూషణలు చేయడం సరికాదన్నారు. రేవంత్‌రెడ్డి.. ఈటలకు క్షమాపణ చెప్పకుంటే ముదిరాజ్‌లు కాంగ్రెస్‌ పార్టీకి దూరం కావడం ఖాయమని ఆయన హెచ్చరించారు.

చకచకా పనులు

- తుది దశకు ముబారక్‌పూర్‌ బ్రిడ్జి నిర్మాణం
- త్వరలో అందుబాటులోకి..
- ఏడు గ్రామాల ప్రజలకు తీరనున్న రవాణా కష్టాలు
- హర్షం వ్యక్తం చేస్తున్న మండల ప్రజలు

నవాబుపేట: మండల ప్రజల ఎన్నో ఏళ్ల నిరీక్షణ.. చిరకాల వాంఛ ఎట్టకేలకు నెరవేరుతోంది. మూసీ నదిపై బ్రిడ్జిని ఇంతలో చూసేమా అన్న కళ త్వరలో సాకారం కానుంది. ప్రస్తుతం పనులు చకచకా సాగుతున్నాయి. అనుకున్న సమయానికే బ్రిడ్జి అందుబాటులోకి రానుండడంతో మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పలు గ్రామాల రైతుల రవాణా కష్టాలు దూరం కానున్నాయని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రైల్వే ట్రాక్‌, మూసీ నదికి ఇరువైపులా ఏడు గ్రామాలు ఉంటాయి. ఈ గ్రామాలకు రాకపోకలు సాగించాలంటే రెండు చోట్ల నుంచి మాత్రమే అవకాశం ఉంది. మూసీ నది మండల పరిధిలో దాదాపు 18 కిలో మీటర్ల మేర ప్రవహిస్తుంది. ఈ నది పొడవునా అర కిలోమీటర్‌ దూరం నుంచి రైల్వే ట్రాక్‌ 19 కిలోమీటర్ల వరకు ఉంటుంది. కేవలం గంగ్యాడ గ్రామం వద్ద మాత్రమే మూసీ నదిపై బ్రిడ్జి నిర్మించారు. దానికి అతి సమీపంలోనే గొల్లగూడ రైల్వేస్టేషన్‌ వద్ద ఒక్క చోట మాత్రమే రాకపోకలకు గేటు ఉంది. మండలంలో 32 గ్రామ పంచాయతీలు, రెండు అనుబంధ గ్రామాలు ఉన్నాయి. ఈ ఏడు గ్రామాల ప్రజలు మండల కేంద్రంతో పాటు మిగిలిన 27 గ్రామాలకు వెళ్లాలన్నా.. ఆ గ్రామాల ప్రజలు ఈ గ్రామాలకు రావాలన్నా ప్రస్తుతం ఉన్న గొల్లగూడ రైల్వే గేటు, గంగ్యాడ వద్ద ఉన్న మూసీ నదిపై ఉన్న బ్రిడ్జి నుంచే రాకపోకలు సాగించాలి. మరో చోట నుంచి వెళ్లడానికి వీలు లేదు.

ఏడాది క్రితం బ్రిడ్జి మంజూరు

మూసీ నదిపై ముబారక్‌పూర్‌ వద్ద రూ. 4.5 కోట్లతో బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. గతేడాది కాంట్రాక్టర్‌ పనులు ప్రారంభించి పత్తాలేకుండా పోయాడు. దీంతో ఏడాది పాటు పనులు నిలిచిపోయాయి. ఎమ్మెల్యే కాలె యాదయ్య ప్రత్యేక చొరవతో రీ టెండర్‌ పిలిచి పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకున్నారు. దీంతో నాలుగు నెలల క్రితం మళ్లీ పనులు ప్రారంభించారు. ప్రస్తుతం బ్రిడ్జి నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయి.

నెరవేరనున్న చిరకాల వాంఛ

ముబారక్‌పూర్‌, పర్వేద, గుబ్బడిపత్తేపూర్‌, మసాన్‌పల్లి, అంతప్పగూడ ప్రజల రాకపోకలను తీవ్ర ఇబ్బంది పడేవారు. మూసీ నది వర్షాకాలం మొదలు కొని జనవరి వరకు పారుతుంది. దీంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయేవి. వర్షాకాలం 6 నెలల పాటు రైతుల బాధలు వర్ణణాతీతం. మూసీ దాటే క్రమంలో రైతులు, మూగ జీవాలు మృత్యువాత పడేవి. బ్రిడ్జి పనులు పూర్తయితే ప్రమాదాలకు అడ్డుకట్ట వేసినట్లే.



చివరి దశకు చేరిన ముబారక్‌పూర్‌ బ్రిడ్జి పనులు

ఎమ్మెల్యే చొరవతో..



ముబారక్‌పూర్‌ వద్ద మూసీ నదిపై బ్రిడ్జి నిర్మాణానికి ఎమ్మెల్యే కాలె యాదయ్య ప్రత్యేక చొరవ చూపారు. దీంతో పనులు వేగం పుంజుకున్నాయి. ప్రస్తు తం బ్రిడ్జి నిర్మాణం చివరి దశకు చేరుకుంది. త్వరలో అందుబాటులోకి వస్తుంది. దీంతో ఏడు గ్రామాల ప్రజలకు రవాణా సమస్య తీరుతుంది. ఇందుకు ఎమ్మెల్యే యాదయ్యకు కృతజ్ఞతలు.

– బాలమణి, ముబారక్‌పూర్‌, సర్పంచ్‌

త్వరలో అందుబాటులోకి..

ముబారక్‌పూర్‌ వద్ద మూసీ నదిపై బ్రిడ్జి నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. దాదాపు 90 శాతం పనులు పూర్తయ్యాయి. 10శాతం పనులను కూడా త్వరలో పూర్తి చేసి బ్రిడ్జిని అందుబాటులోకి తెస్తాం.

– మాధవరెడ్డి, డీఈ, పంచాయత్‌రాజ్‌, వికారాబాద్‌

తెలంగాణ ఆత్మగౌరవాన్ని కాపాడాలి

ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

కొడంగల్‌: పట్టణంలోని రాఘవేంద్ర ఫంక్షన్‌ హాల్‌లో మంగళవారం ఉదయం 10గంటలకు నిర్వహించే బీఆర్‌ఎస్‌ నియోజకవర్గ స్థాయి బహిరంగ సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి కోరారు. సోమవారం తన క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలోని 8 మండలాల నుంచి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో సభకు తరలి రావాలన్నారు. ఈ నెల 27న బీఆర్‌ఎస్‌ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహిద్దామని తెలిపారు. 25వ తేదీ అన్ని గ్రామాల్లో పార్టీ జెండాలను ఎగురవేయాలన్నారు. తెలంగాణ ఆత్మ గౌరవాన్ని కాపాడాల్సిన సమయం వచ్చిందన్నారు. ఊరూ వాడా కలిసి వచ్చి కేసీఆర్‌కు సంఘీభావం ప్రకటించాలన్నారు. తెలంగాణ ద్రోహులు ప్రజలను మోసం చేయడానికి మళ్లీ వస్తున్నారని విమర్శించారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

ఇంకుడు గుంతలు మంజూరు చేయండి

ఎస్‌బీఎం జిల్లా కో ఆర్డినేటర్‌ లక్ష్మి

మర్పల్లి: ప్రతి ఇంటికీ వ్యక్తి గత మరుగుదొడ్డి, అలాగే మురుగు నీరు రోడ్లపైకి వెళ్లకుండా ఇంకుడు గుంతలు మంజూరు చేయాలని ఎస్‌బీఎం జిల్లా కో ఆర్డినేటర్‌ లక్ష్మి ఎంపీడీఓ రాజ్‌ మల్లయ్యకు సూచించారు. సోమవారం మండల పరిషత్‌ కార్యాలయంలో వ్యక్తి గత మరుగుదొడ్లు, ఇంకుడు గుంతల పనులపై సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది, ఐకేపీ సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 3 రోజుల పాటు ఈ శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఫేస్‌ వన్‌ కింద గతంలో మరుగుదొడ్లు, ఇంకుడు గుంతల పనులు చేపట్టినట్లు తెలిపారు. ఇంకుడు గుంతలు, మరుగుదొడ్ల కోసం దరఖాస్తు చేసుకుంటే వెంటనే మంజూరు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీఓ మహేష్‌, ఏపీఓ అంజిరెడ్డి, పీఎం పోచయ్య, ఆయా గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, టీఏలు, ఎఫ్‌ఏలు, సీసీలు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌బీఎం జిల్లా కో ఆర్డినేటర్‌ లక్ష్మి

హామీల అమలులో బీఆర్‌ఎస్‌ విఫలం

డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి

పరిగి: స్థానిక ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి అసమర్థత వల్లే నియోజకవర్గ అభివృద్ధి కుంటుపడిందని, తాను అధికారంలో ఉన్నా, లేకున్నా ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తానని డీసీసీ అధ్యక్షుడు టీ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని జాఫర్‌పల్లిలో రాజ్యసభ సభ్యుడు ఆర్‌ కృష్ణయ్య నిధులు రూ. 15లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్‌ లాల్‌కృష్ణతో కలసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో సీఎం కేసీఆర్‌ ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా నెరవేర్చలేదన్నారు. ఇటీవల బీఆర్‌ఎస్‌ ఎమ్మెల్యేలు గ్రామాల పర్యటన చేస్తున్నారని, వారిని ప్రజలు ఎక్కడికక్కడ నిలదీస్తున్నారని తెలిపారు. పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు రావడం లేదని పేర్కొన్నారు. దీంతో సర్పంచులు సొంత డబ్బు వెచ్చించి పనులు చేయాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. చాలా మంది సర్పంచులు చేసిన అప్పులకు వడ్డీ కట్టలేని స్థితిలో ఉన్నారని తెలిపారు. ఎమ్మెల్యే అసమర్థతతోనే పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం అగమ్య గోచరంగా మారిందన్నారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి హన్మంతు ముదిరాజ్‌, సర్పంచ్‌ అనిత, నాయకులు కృష్ణ, చిన్న నర్సింహులు, ఆంజనేయులు, అనంతరెడ్డి, రాజ పుల్లారెడ్డి, వెంకట్‌ తదితరులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి తదితరులు

కేంద్రం నిధులతోనే గ్రామాల అభివృద్ధి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు సదానందరెడ్డి
- చేవెళ్ల సభ విజయవంతంపై హర్షం

అనంతగిరి: చేవెళ్లలో నిర్వహించిన బీజేపీ విజయ సంకల్ప సభకు జిల్లా నుంచి భారీ ఎత్తున తరలివచ్చిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు, మేధావులకు జిల్లా అధ్యక్షుడు సదానందరెడ్డి ధన్యవాదాలు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా సభకు పార్లమెంట్‌ నలుమూలల నుంచి స్వచ్ఛందంగా ప్రజలు భారీగా తరలివచ్చారన్నారు. అమిత్‌షా ప్రసంగం నాయకులు, కార్యకర్తల్లో నూతన ఉత్సాహం నింపిందన్నారు. పార్టీ క్షేత్రస్థాయిలో బలంగా ఉందన్నారు. అన్ని బూత్‌లలో పార్టీ పటిష్టవంతంగా పనిచేస్తోందన్నారు. ప్రతి బూత్‌ నుంచి కార్యకర్తలు తరలివచ్చారన్నారు. పాలమూరు పథకం ద్వారా సాగునీరు అందిస్తామని మాట ఇచ్చి తప్పిన బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధులతోనే గ్రామాల్లో అభివృద్ధి జరుగుతోందన్నారు. జిల్లాకు మంజూరైన నవోదయ కేంద్రీయ విద్యాలయాన్ని ఎందుకు ప్రారంభించడం లేదని ప్రశ్నించారు. కేంద్రం నిధులతో తాండూరు అర్బన్‌ డెవలప్‌మెంట్‌ సెంటర్‌ పనులు పూర్తయి రెండు సంవత్సరాలు కావస్తున్నా ఎందుకు ప్రారంభించడం లేదని నిలదీశారు. నాగారం గ్రామానికి కృషి సంచాయ్‌ యోజన కింద మంజూరైన చెరువును ఎందుకు ప్రారంభించడం లేదని ప్రశ్నించారు.



సదానందారెడ్డి

ఇంట్లో నిద్రిస్తుండగా చోరీ

లక్ష నగదు, 5 సెల్‌ఫోన్లు ఎత్తుకెళ్లిన దుండగులు

కొత్తూరు: ఆదమరిచి నిద్రిస్తున్న ఇంట్లోకి ప్రవేశించిన దొంగ లక్ష 46 వేల రూపాయల నగదు, 5 సెల్‌ఫోన్లను ఎత్తుకెళ్లారు. ఈ సంఘటన కొత్తూరు పట్టణంలో సోమవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. వివరా లు ఇలా ఉన్నాయి. నారాయణగుడ కాలనీకి చెందిన కాలురామ్‌ అతని సోదరులు మరి కొంత మంది కూలీలతో గ్రానైట్‌ వేసే పను లు చేస్తుంటారు. పనుల నిమిత్తం కాలురామ్‌ ఆదివారం షాద్‌నగర్‌కు వెళ్లాడు. ఆయన సోదరులు, పని చేసేవారు ఇంట్లో నిద్రపోయారు. వేసవి దృష్ట్యా ఇంటి తలుపులు తెరిచి పడుకున్నారు. ఇదే అదనుగా భావించిన దొంగలు ఇంట్లోకి ప్రవేశించి ప్యాంటు జేబులో ఉన్న రూ. లక్ష 46 వేల నగదు, 5 సెల్‌ఫోన్లను ఎత్తుకెళ్లారు. ఉదయం విషయం గమనించిన బాధితుడు చోరీ జరిగిన విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఏడాది పాటు పుస్తకాలతో కుస్తీ పట్టిన విద్యార్థులు.. 2022 - 23 విద్యాసంవత్సరం సోమవారం నాటితో ముగియడంతో ఉత్సాహంగా ఇళ్లకు వెళ్లారు. అంతకుముందు ఉపాధ్యాయులతో సెల్ఫీలు తీసుకున్నారు.

– బొంరాస్‌పేట



బొంరాస్‌పేట స్కూల్‌లో విద్యార్థులతో టీచర్‌ సెల్ఫీ



బొంరాస్‌పేట పాఠశాల నుంచి ఇళ్లకు వెళ్తున్న విద్యార్థులు

కేంద్ర ప్రభుత్వాన్ని గద్దె దింపుదాం



లెనిన్‌నగర్‌ ప్రజాపోరు యాత్రలో పాల్గొన్న రవీంద్రాచారి తదితరులు

మీర్‌పేట: ప్రజలను నమ్మించి మోసం చేస్తున్న కేంద్ర ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు ప్రజలు సన్నద్ధం కావాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏ రవీంద్రాచారి పిలుపునిచ్చారు. ప్రజాపోరు యాత్రలో భాగంగా సోమవారం మీర్‌పేట లెనిన్‌నగర్‌లో స్థానిక నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్లి కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను వివరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో రవీంద్రాచారి మాట్లాడుతూ.. రాష్ట్రంలో విభజన హామీలను అమలు చేయించలేని తెలంగాణ బీజేపీ నాయకులకు ఓటు అడిగే హక్కు ఎక్కడిదని ప్రశ్నించారు. బ్యాంకులకు వేల కోట్ల రూపాయలు మోసం చేసి దేశం విడిచి పారిపోయిన దొంగల అప్పులను కేంద్ర ప్రభుత్వం మాఫీ చేయడం సిగ్గు చేటన్నారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే నల్లధనాన్ని వెనక్కి తెచ్చి పేద ప్రజల ఖాతాల్లో రూ.15లక్షలు వేస్తామని చెప్పి 9 ఏళ్లు అవుతున్నా 15 రూపాయలు కూడా వేయలేదని ఆరోపించారు. హిట్లర్‌ తరహా పాలన సాగిస్తున్న నరేంద్ర మోదీ ప్రభుత్వానికి 2024 ఎన్నికల్లో ఓడించాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బీ దత్తునాయక్‌, బాలాపూర్‌ మండలకార్యదర్శివెంకటరమణారెడ్డి,నాయకులు యాదయ్య, నరేందర్‌, దశరథ్‌, పీ రాజు, శత్రునాయక్‌, అంజయ్య, రజియా, ఆదిలక్ష్మి, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

డీసీఎం ఢీకొని వ్యక్తి మృతి



మొగులయ్య మృతదేహం

శంకర్‌పల్లి: బైక్‌ను డీసీఎం వాహనం ఢీ కొనడంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని కొత్తపల్లి శివారులో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీ సులు తెలిపిన వివరాలు.. వికారాబాద్‌ జిల్లా, పరిగి మండలం, చిట్యాల్‌ గ్రామానికి చెందిన ఎం మొగులయ్య(52), పీ యాదగిరి ఆదివారం పని నిమిత్తం హైదరాబాద్‌కు బైక్‌పై బయలుదేరారు. పని ముగించుకొని సాయంత్రం ఇంటికి వస్తుండగా కొత్తపల్లి శివారులో వీరి బైక్‌ను ఎదురుగా వస్తున్న డీసీఎం వాహనం ఢీ కొట్టింది. మొగులయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. యాదగిరికి గాయాలయ్యాయి. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సంతోష్‌రెడ్డి తెలిపారు.

కుక్కల దాడిలో 22మేకల మృతి

కొత్తూరు: కుక్కల దాడిలో 22 మేకలు మృతి చెందిన సంఘటన నందిగామ మండలంలో సోమవారం చోటుచేసుకుంది. నర్సప్పగూడకు చెందిన రైతు జీ జగనయ్య కొన్నేళ్ల నుంచి మేకలు పెంచుతూ జీవనోపాధి పొందుతున్నాడు. రోజు మాదిరిగానే రాత్రి తన పాకలో మేకల మందను ఉంచి ఇంటికి వెళ్లాడు. అర్ధ రాత్రి మేకల అరుపులకు పాకలోకి రాగా కుక్కలు దాడి చేస్తున్నాయి. వాటిని తరిమి లోనికి వెళ్లి చూడగా సుమారు 22 మేకలు మృత్యువాతపడ్డాయి. వీటి విలువ రూ. 1.50 లక్షలు ఉంటుందని బాధితుడు కన్నీటి పర్యంతమయ్యాడు. తనను ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశాడు. గొర్రె కాపరుల సంఘం నాయకుడు సురేందర్‌, సర్పంచ్‌ గోవిందు అశోక్‌కుమార్‌ బాధిత రైతును పరామర్శించి ప్రభుత్వ పరంగా పరిహారం అందేలా చూస్తామని హామీ ఇచ్చారు.


వృద్ధురాలి అదృశ్యం



శాంతబాయి(ఫైల్‌)

పహాడీషరీఫ్‌: వృద్ధురాలు అదృశ్యమైన సంఘటన పహాడీషరీఫ్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై మధుసూదన్‌ కథనం మేరకు.. జియాగూడకు చెందిన శాంత బాయి(82)ని వారం రోజుల క్రితం జల్‌పల్లి శ్రీరాం కాలనీలో నివాసం ఉండే ఆమె కుమార్తె రాధాబాయి తన ఇంటికి తీసుకెళ్లింది. ఈ నెల 21న కుటుంబ సభ్యులు ఇంట్లో నిద్రించారు. ఉదయం లేచి చూడగా శాంత బాయి కనిపించలేదు. ఆమె ఆచూకీ పలు ప్రాంతాల్లో వెతికినా ప్రయోజనం లేకపోవడంతో సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వృద్ధురాలి ఆచూకీ తెలిసిన వారు పహాడీషరీఫ్‌ పోలీస్‌స్టేషన్‌ లేదా సెల్‌ నంబర్‌ 9490617241కు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

కారు బోల్తా: ముగ్గురికి గాయాలు



గాయపడిన శ్రీకాంత్‌

చేవెళ్ల: కారు అదుపు తప్పి బోల్తా పడిన ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని దేవుని ఎర్రవల్లి వద్ద చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. సంగారెడ్డి జిల్లా రాంచంద్రాపురం మండలం ఉస్మాన్‌సాగర్‌ గ్రామానికి చెందిన బీ శ్రీకాంత్‌, డీ మహిపాల్‌, డీ కృష్ణారెడ్డి సోమవారం కారులో చేవెళ్లకు వచ్చారు. సాయంత్రం శంకర్‌పల్లి వైపు వెళుతుండగా దేవుని ఎర్రవల్లి వద్ద కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. సమాచారం అందుకున్న ఎస్‌ఐ విఠల్‌రెడ్డి, ఏఎస్‌ఐ చందర్‌ నాయకులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. క్షతగాత్రులను చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన శ్రీకాంత్‌ను మెరుగైన వైద్యం కోసం నగరానికి తరలించారు. మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కారు ఢీకొని మహిళ మృతి



రాములమ్మ మృతదేహం

కడ్తాల్‌: మండలంలోని మైసిగండి గ్రామం శ్రీశైలం – హైదరాబాద్‌ జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందింది. ఎస్‌ఐ హరిశంకర్‌గౌడ్‌ తెలిపిన వివరాలు.. ఆమనగల్లు మండలం సింగంపల్లికి చెందిన ఏ రాములమ్మ(65) ఆదివారం మైసిగండి ఆలయం వద్ద బంధువుల ఫంక్షన్‌కు హాజరయ్యారు. తిరిగి అదే రోజు రాత్రి 9గంటల సమయంలో ఇంటికి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా హైదరాబాద్‌ నుంచి కల్వకుర్తి వైపు వెళుతున్న కారు రాములమ్మను అతి వేగంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో రాములమ్మ తీవ్రంగా గాయపడింది. స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు క్షతగాత్రురాలిని అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. మృతురాలి కుమారుడు యాదయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వీఓఏల డిమాండ్లు తీర్చాల్సిందే

జాతీయ బీసీ కమిషన్‌ మాజీ సభ్యుడు ఆచారి

కడ్తాల్‌: సీఎం కేసీఆర్‌ కుటుంబ పాలనలో ఏ ఒక్కరికీ భద్రత లేకుండా పోయిందని, తెలంగాణ ఏర్పాటు తర్వాత కేవలం కల్వకుంట్ల కుటుంబం మాత్రమే బాగుపడిందని జాతీయ బీసీ కమిషన్‌ మాజీ సభ్యుడు ఆచారి విమర్శించారు. సమస్యల పరిష్కారం కోసం కడ్తాల్‌లో వీఓఏలు చేపట్టిన సమ్మెకు సోమవారం బీజేపీ నాయకులతో కలసి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆచారి మాట్లాడుతూ.. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో ఐకేపీ వీఓఏలు ముఖ్య పాత్ర పోషిస్తారని కొనియాడారు. వీఓఏల డిమాండ్లను వెంటనే తీర్చాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. సమస్యల పరిష్కారం కోసం వారం రోజులుగా వీఓఏలు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోక పోవడం దారుణమన్నారు. వీఓఏల పోరాటానికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మాన్యనాయక్‌, రాష్ట్ర నాయకులు మోహన్‌రెడ్డి, రామ్‌రెడ్డి, బీజేవైఎం రాష్ట్ర నాయకుడు భగీరథ్‌, జిల్లా నాయకులు సాయిలాల్‌, లక్ష్మణ్‌నాయక్‌, రవీందర్‌రెడ్డి, మండల నాయకులు జే సాయిలు, జే రవి, కుమార్‌, చందన్‌నాయక్‌, వెంకటేశ్‌, రాందాస్‌నాయక్‌, వెంకటేశ్‌, మల్లేశ్‌, ప్రేమ్‌ కుమార్‌, శివ, ప్రవీణ్‌ తదితరులు పాల్గొన్నారు.



వీఓఏల సమ్మె శిబిరంలో మాట్లాడుతున్న ఆచారి